# కుళ్ళు

"కుళ్ళు... ఎక్కడ చూసినా కుళ్ళు... ఈ దేశమంతా కుళ్ళిపోయి కంపు కొడ్తోంది. వాడెవడో అన్నట్టు ఈ దేశమే ఓ పెద్ద లెవెట్రీ" అన్నాడు భాస్కర్రావు స్కాచ్ విస్కీ సిప్‌చేస్తూ.

"కరెక్ట్ సర్. చాలా గ్రాండ్‌గా చెప్పారు" అన్నాడు దేవేందర్, భాస్కర్ ఖాళీ చేసిన పెగ్గులో విస్కీ పోస్తూ.

భాస్కర్ ప్లేయర్స్ సిగిరెట్ వెలిగించాడు.

బార్ నిండా జనం కిటకిటలాడుతున్నారు. ఆ పట్నానికంతా ఈ బారే పెద్దదని చెప్పుకుంటారు. ఆ పట్నంలోని డబ్బున్నవాళ్ళంతా ఆ బార్‌కే వస్తారు. సొసైటీ లేడీస్ అనబడేవాళ్ళ పట్టుచీరల రెపరెపలు, అర్థనగ్న శరీరాల మిలమిలలు, వాళ్ళ కనుసన్నల్లో మెదులుతూ వాళ్ళనంటిపెట్టుకొని ఉండే నల్లబూట్లు... ఆ బార్ నిండా కోలాహలంగా కనిపిస్తున్నాయి.

నీట్ యూనిఫామ్స్‌లో అటూఇటూ హడావుడిగా తిరుగుతున్నారు వెయిటర్స్.

దేవేందర్, భాస్కర్రావు కూర్చున్న టేబుల్ మీద ఓ వెయిటర్ 'తందూరి ఛికెన్' తెచ్చిపెట్టాడు.

"తందూరి అంటే నాకు చాలా యిష్టం" అన్నాడు భాస్కర్ చేతిలోకి ఫోర్కుని తీసుకుంటూ.

"ఇవ్వాళ్ళ మీకిష్టమైన దేదైనా ఆర్డరివ్వండి సార్. బ్లాంక్ చెక్ ఇచ్చేశాను మీకు" అన్నాడు దేవేందర్.

"థాంక్యూ... థాంక్యూ వెరీమచ్" అన్నాడు భాస్కర్.

తనకు ఇంతమంచి 'ఫ్యాన్' ఒకడు దొరికినందుకు భాస్కర్ లోలోపల చాలా సంతోషించాడు. దేవేందర్ ఓ బంగారుపిచుక అని భాస్కర్ త్వరలోనే తెలుసుకున్నాడు. దేవేందర్ తన కవిత్వమంటే పడిఛస్తాడు.

ఒకరోజు తను ఆఫీసులో ఫైల్స్‌లో మునిగి ఉన్నాడు.

"ఎక్స్క్యూజ్మీ సర్. ప్రఖ్యాత ఆధునిక కవులు భాస్కర్ మీరేనా?" అన్నాడు తన ఎదురుగా నిల్చున్న ఓ అందమైన ఇరవైయేళ్ళ యువకుడు.

"ఔను. నేనే" అన్నాడు భాస్కర్.

"వెరీగ్లాడుటుసీయూ సర్. ఐయామ్ వన్ ఆఫ్ యువర్ ఆర్డెంట్ ఫ్యాన్స్. ముఖ్యంగా ఇటీవల మీ కవితా సంకలనం 'కుళ్ళు' చదివినప్పటినుండి మిమ్మల్ని

చూడాలని ఎంతో ఇదిగా అనుకుంటున్నాను. మొన్ననే మా ఫ్రెండొకడు చెప్పాడు మీరు ఈ ఆఫీసులో పనిచేస్తారని. వెంటనే మిమ్మల్ని వెతుక్కుంటూ వచ్చాను" అన్నాడు దేవేందర్ పరవశించిపోతూ.

"చాలా సంతోషం. కూర్చోండి" అన్నాడు భాస్కర్ కుర్చీ చూపిస్తూ. దేవేందర్ కూర్చున్నాడు. దేవేందర్ రూపం, అతడు వేసుకున్న బట్టలు చూసి అతడు చాలా డబ్బున్నవాళ్ళ బిడ్డ అని భాస్కర్ గ్రహించాడు.

తనను చూడడానికి ఎవరో ఒకరు ఇలా రావడం భాస్కర్‌కు మామూలే. అతనికి ఆధునిక కవిగా మంచి పేరుంది. అతని గేయాలు చాలా పత్రికల్లో అచ్చయ్యాయి. ముఖ్యంగా యువతరం భాస్కరంటే పడిఛస్తారు. అందుకని అతన్ని చూడటానికి ముఖ్యంగా యూనివర్సిటీ స్టూడెంట్స్ వస్తుండేవాళ్ళు. వాళ్ళతో కాస్సేపు కవిత్వాన్ని గురించి మాట్లాడి పంపిస్తుండేవాడు.

భాస్కర్ కవిత్వంలోను, మాటల్లోను, ఎప్పుడు ఒకటే విషయం దొర్లుతుండేది. అదేమిటంటే: సమాజం నిండా కుళ్ళు వ్యాపించి పోయిందన్న విషయం. అతనికి 'కుళ్ళు' 'కంపు' లాంటి మాటలు చాలా ఇష్టం. "ఎక్కడ చూసినా కుళ్ళు. ఎవడిలో చూసినా కుళ్ళు. స్వార్థమనే కుళ్ళు. కులమనే కుళ్ళు. మతమనే కుళ్ళు. లంచగొండితనమనే కుళ్ళు. సమాజపు అంగాంగంలోకి నరనరాల్లోకి వ్యాపించిన ఈ కుళ్ళు పోవాలంటే ఓ బ్రహ్మాండమైన శస్త్రచికిత్స జరగాలి" అంటాడు భాస్కర్. ఇదే విషయాన్ని గొప్ప ఆవేశంతో, ఆవేదనతో రాస్తాడు.

"మీ కవితల్లో గొప్ప వేదన ఉందండి. మీ శైలిలో గొప్ప ఫోర్సు ఉందండి. మీరు వాడే ఒక్కొక్క పదం ఒక్కొక్క అగ్నిపర్వతం" అన్నాడు దేవేందర్.

"ఔను. మీరు నా కవితల్లోని బేసిక్ ఎలిమెంట్‌ని చక్కగా పట్టారు. చాలామంది ప్రొగ్రెసివ్‌గా ఫోజుకొట్టేవాళ్ళే నా కవిత్వంలో కేవలం బూతులున్నాయనో, అశ్లీలాలున్నాయనో మూర్ఖంగా విమర్శిస్తున్నారు. ఆ బూతుల వెనుక దాగిఉన్న నా ఆవేదనను, ఆరాటాన్ని గుర్తించలేకపోతున్నారు."

ఇలా సాగాయి వాళ్ళ మాటలు. ఇంతవరకు తన దగ్గరకు మీ కవిత్వం మాకు నచ్చిందని వచ్చిన వాళ్ళల్లోకల్లా దేవేందర్ అతనికి బాగానచ్చాడు. దేవేందర్ సెన్స్ మాట్లాడుతున్నాడు.

"అలా క్వాలిటీ దాకా వెళ్ళి కాఫీ తాగుదాం రండి" అన్నాడు దేవేందర్.

ఫైల్స్ సర్దేసి భాస్కర్ అతనివెంట బయటకొచ్చాడు. తళతళ మెరుస్తున్న అంబాసిడర్ కారు దగ్గరకు దారితీస్తున్న దేవేందర్‌ను చూసి భాస్కర్ సంభ్రమాశ్చర్యాల్ని పొందాడు. తనకు కారున్నవాడు ఫ్యాన్‌గా దొరికాడని గర్వించాడు.

అప్పట్నించి దేవేందర్ భాస్కర్ కోసం తరుచుగా వస్తుండేవాడు. భాస్కర్‌ను కార్లో కూర్చోబెట్టుకొని హోటళ్ళకు, బార్లకు, సినిమాలకు తిప్పేవాడు.

తన కవిత్వాన్ని గూర్చి, తన కవిత్వ ప్రయోజనాన్ని గూర్చి భాస్కర్ దేవేందర్‌కు గంటలకొద్ది చెప్తుండేవాడు.

* * * *

"ఈమధ్య కొత్తగా ఏమన్నా రాశారా సార్?" అన్నాడు దేవేందర్ తనూ ఓ సిగిరెట్ వెలిగిస్తూ.

"నిన్ననే ఓ పీస్ రాశాను. ఓ పత్రికవాడు దీపావళి సంచికకు గేయం పంపించమని ఓ పది ఉత్తరాలైనా రాసుంటాడు. 100 రూపాయల చెక్కు కూడా పంపించాడు. మీ గేయం లేకుండా నా పత్రిక ఒక్క కాపీకూడా సేల్ కాదంటాడు. పూర్ ఫెల్లో, పోనీయ్‌లే అని వాడికి నిన్ననే ఓ గేయం పంపించాను"

"ఆ గేయాన్ని వినిపించండి"

చేతిలో ఉన్న సిగిరెట్ ఆష్‌ట్రేలో పడేసి మరో సిగిరెట్ వెలిగించాడు భాస్కర్.

"ఈ ఎడిటర్స్ ఉన్నారే కవిత్వం ఎప్పుడంటే అప్పుడొస్తుందనుకుంటారు. గొప్ప కవిత్వం రావాలంటే మూడ్ రావాలి. నేను మూడ్ వస్తే తప్ప ఒక్కలైన్ కూడా రాయలేను. నాకు బార్స్‌లో కాఫీ హోటళ్ళతో తప్ప ఎక్కడ పడితే అక్కడ మూడ్ రాదు. గొప్ప కవికి ఎవడికైనా అంతే. జీన్‌పాల్‌సార్త్రే పేరు వినే ఉంటావు. చాలా గొప్పవాడులే. అతడు 24 గంటలు ప్యారిస్‌కేఫ్స్‌లోనే గడుపుతాడట. ఆయన రాసిన ముఖ్యమైన రచనలన్ని కేఫ్స్‌లో కూర్చొని రాసినవే" భాస్కర్ జేబులో ఉన్న కాగితాల్ని తీశాడు.

"చదవండి సార్" చాలా ఆతురతగా అడిగాడు దేవేందర్.

"ఈ పీస్‌కు ఐడియా మొన్న మనం బార్‌కు వెళ్ళామే. ఆరోజు కల్గింది"

భాస్కర్ చాలా ఆవేశంగా ఒక్కొక్క లైనును రెండుసార్లు రిపీట్ చేస్తూ చదివాడు.

వరే!

మీరంతా సిఫిలిస్‌గాళ్ళు

మీరంతా గనేరియాగాళ్ళు

మీ వంటినిండా కుళ్ళు

మీ నరనరాల్లో కుళ్ళు

మీరు మొగుడు విడిచిన ముండలు

బజారు రకాలు
మీరు మురికివాళ్ళు
మీరు పిరికివాళ్ళు
మీకు భయం
నాయకులంటే భయం
పెళ్ళామంటే భయం
ఆఫీసరంటే భయం
పోలీసులంటే భయం
ప్రాస్టిట్యూట్స్ అంటే భయం
మీరు వెన్నెముక విరిగినవాళ్ళు.
నా జాతిని నిర్వీర్యం చేస్తున్నవాళ్ళు
మిమ్మల్ని
నా కలంతో నరుకుతాను
నా మాటల మంటల్లో మసి చేస్తాను
నా పాటల పల్లవితో పాతాళంలో పాతేస్తాను.
వరే
మీ ముడ్డిమీద తంతాను
మీ నడ్డి విరగ్గొడతాను.

భాస్కర్ చదవటం ముగించి సిగిరెట్ వెలిగించాడు.

"బావుంది బావుంది. చాలా బావుంది. గ్రాండ్‌గా ఉంది. ఎంత గ్రాండ్‌గా ఉందో చెప్పలేను సార్"

దేవేందర్ పెద్దగా చప్పట్లు కొడ్తూ అన్నాడు. చుట్టుపక్కల టేబుల్స్ దగ్గరి నాగరికులంతా వీళ్ళకేసి తిరిగి యేం జరిగిందన్నట్టు చూశారు.

"మీరు వాడిన ఒక్కొక్క పదంలో ఎంత ఫోర్స్ ఉందిసార్. "ముడ్డిమీద తంతాను-నడ్డి విరగ్గొడతాను. ఓహో! సింప్లీగ్రేట్. మీరు నిజంగా జీనియస్సార్!" అన్నాడు దేవేందర్.

భాస్కర్ ముసిముసి నవ్వులు నవ్వాడు.

"ఒకసారి యేమయిందో తెలుసా. నేనో కవిసమ్మేళనంలో ఇలాంటిదే ఓ పీస్ చదివాను. అంతకుముందు చదివిన కవులంతా వట్టి చచ్చు వెధవలు. ప్రేమ,

ప్రేయసి అంటూ నపుంసక శృంగారాన్ని వాంతి చేసుకున్నారు. వాళ్ళు చదువుతోంటే జనమంతా 'దిగిపోండి' 'దిగిపోండి' అంటూ గోల చేశారు. అప్పుడు నాపేరు పిలిచారు. బోస్టింగ్ కాదుగాని డియర్ దేవేందర్, నేను చదివిన ప్రతీ లైనుకు నన్ను ఛీర్ చేశారు. ఇంతసేపు నిద్రపోతున్న వాళ్ళంతా లేచి కూర్చున్నారు. ఒక్కొక్కడు ఉద్రేకంతో ఊగిపోయారు. నేను ముగించాక జనమంతా యేకకంఠంతో దిక్కులు పిక్కటిల్లేలా "స్టాండింగ్ ఒవేషన్" యిచ్చారు. అక్కడి వాళ్ళంతా ఆడియెన్స్ నుండి అంత బ్రహ్మాండమైన రెస్పాన్స్ ఇంతవరకెవరికీ లభించలేదన్నారు. కవిత్వమంటే అదీ కవిత్వం. ప్రజల్లోకి దూసుకుపోవాలి. లోకంలో ప్రతిక్షణం జరుగుతున్న అన్యాయాల్ని, అక్రమాల్ని కవిత్వంలోకి తీసుకురావాలి. ప్రపంచమంతా వ్యాపించిన కుళ్ళును మన కవిత్వంతో కడిగేయాలి" అన్నాడు భాస్కర్.

"మీరన్న ప్రతీమాట ఒక జెమ్ సార్. మీకు మహోజ్వల భవిష్యత్తు ఉంది. యూహేవ్ ఏ గ్రేట్ ఫ్యూచర్ బిఫోర్ యూ– మీ పొయెట్రీని ఇంగ్లీషులోకి ట్రాన్స్‌లేట్ చేస్తే బావుంటుంది కదు! ఆ ప్రయత్నం ఎందుకు చెయ్యకూడదు?"

"నా కవిత్వం ఇంగ్లీషులోకి ట్రాన్స్‌లేట్ కావాలేగాని స్టేట్స్‌లో ప్రళయం పుడ్తుంది. అక్కడి యువతరంలో గొప్ప విప్లవ జ్వాలలు చెలరేగుతాయి. వాళ్ళల్లోని ఆ రెబిలియన్ మూడ్‌ని ప్రతిబింబించే కవిత అక్కడ రావటం లేదు. నా కవిత ఇంగ్లీషులోకి ట్రాన్స్‌లేట్ అవుతే ఈ లోపం తీరుతుంది. ప్రపంచమంతటా యువతరంలో వీస్తున్న విప్లవచైతన్యాన్ని నా కవిత్వంలో రూపొందించాను. నా కవిత్వం వాళ్ళదాకా పోతే వాళ్ళు నన్నో దేవుణ్ణి చేసేస్తారు. అదే చూస్తున్నా– నా కవిత్వాన్ని ఇంగ్లీషులోకి ట్రాన్స్‌లేట్ చేసేవాళ్ళు ఎవరైనా దొరుకుతారా అని"

"మీకభ్యంతరం లేకపోతే మీ కవితని ఇంగ్లీషులోకి నేను ట్రాన్స్‌లేట్ చేస్తాను సార్"

"మీరా? రియల్లీ! వండర్‌ఫుల్‌గా ఉంటుంది. ఎందుకంటే మీరు నా కవితలోని బేసిక్ ఎలిమెంట్‌ను చక్కగా అర్థం చేసుకున్నారు. మీరు కేవలం కవిత్వాభిమానులు మాత్రమేననుకున్నాను. మీరు ట్రాన్స్‌లేషన్స్ కూడా చెయ్యగలరన్నమాట"

"నేను కొన్ని ఇంగ్లీషు పీసెస్ కూడా రాశాను సార్. అసలు నాకు ఇంగ్లీషు పొయెట్రీ అంటే ప్రాణం. ఎలియట్‌ని, ఆడెన్నని, స్పెండర్‌ని విపరీతంగా చదివాను. తెలుగులో వాళ్ళస్థాయిలో వచ్చిన పొయెట్రీ ఒక్క మీ పొయెట్రీయే. అందుకే మీ కోసం అలా పరుగెత్తుకుంటూ వచ్చాను"

"సో కైండ్ ఆఫ్ యూ- అయితే మీరు వెంటనే ట్రాన్స్‌లేషన్స్ మొదలెట్టండి. నేను రాసిన పీసెస్ అన్నీ యిస్తాను. 'కుళ్ళు' సంకలనమైతే మీ దగ్గరుందిగా. ఇంకా కొన్నెక్కడో పోయాయండి. నేను చాలా కేర్లెస్ ఫెలోని"

"యేం ఫరవాలేదు సార్. మీరు రాసిన ప్రతీ పీస్ నా దగ్గర ఫైల్లో ఉంది. మీకు చెప్పలేదుగాని, చాలా రోజులుగా మీ పొయెట్రీని ఇంగ్లీషులోకి ట్రాన్స్‌లేట్ చేద్దామనుకుంటున్నాను. స్టేట్స్‌లో నాకు మా బంధువులు, ఫ్రెండ్స్ చాలా మందున్నారు. వాళ్ళల్లో కొందరు అక్కడి పత్రికల్లో రాస్తుంటారు కూడా. మీ పీసెస్ ట్రాన్స్‌లేట్ చేసి వాళ్ళకు పంపుతాను. అక్కడి మేగజిన్స్‌లో పబ్లిష్ అయ్యేలా చూడమని రాస్తాను"

"థాంక్యూ... థాంక్యూ వెరీమచ్. మీరు నాకు ఫ్రెండ్‌గా దొరకటం నిజంగా నా అదృష్టం. నా లిటరరీ కెరియర్‌లో మీతో నా పరిచయం ఒక టర్నింగ్ పాయింట్ కావచ్చు"

వెయిటర్ బిల్లు తెచ్చిచ్చాడు. 198.35 రూపాయలయ్యింది. దేవేందర్ పర్స్‌తీసి రెండు వందరూపాయల నోట్లు పడేస్తూ 'కీప్ ది ఛేంజ్' అన్నాడు. "థాంక్యూ సార్" అని వినయంగా తలవంచి వెళ్ళిపోయాడు వెయిటర్.

"ఇక వెడదామా సార్" అన్నాడు దేవేందర్.

"కమాన్" భాస్కర్ లేచాడు.

బయటికొచ్చి ఇద్దరూ కార్లో కూర్చున్నారు. ఇద్దరూ సిగరెట్లు ముట్టించారు. సిమెంట్ రోడ్డుమీద సాఫీగా సాగిపోయింది కారు.

భాస్కర్ సిగిరెట్‌పొగ వదులుతూ కళ్ళు మూసుకున్నాడు. మేఘాల మీద తేలిపోతున్నట్టుగా ఉందతనికి. ఎంతో హాయిగా ఫీలయ్యాడు. తను స్టేట్స్‌కు వెళ్ళినట్టు, న్యూయార్క్ గ్రీన్విచ్ విలేజ్‌లోను, యునైటెడ్‌నేషన్స్‌లోను కొలంబియా యూనివర్సిటీ లోను తను పొయిట్రీ రిసైట్ చేస్తున్నట్టుగా అనుభూతి పొందాడు.

"మీ క్వార్టర్ వచ్చేసింది సార్" దేవేందర్ కారాపాడు.

"అప్పుడే వచ్చేసిందా. యూ ఆర్ వండర్‌ఫుల్ డ్రైవర్ దేవేందర్" భాస్కర్ నెమ్మదిగా కారు దిగాడు.

"థాంక్యూ వెరీమచ్. ట్రాన్స్‌లేషన్ వెంటనే మొదలెడతారుగదూ" అన్నాడు భాస్కర్ దేవేందర్‌తో షేక్‌హాండ్ చేస్తూ.

రేపట్నుంచీ స్టార్ట్ చేస్తాను. బైదిబై ఒక మాట సార్. మీ ఆఫీసుతో, పర్టిక్యులర్లీ మీరు డీల్ చేస్తున్న సెక్షనుతో మా ఫాదర్‌కు కొంచెం పనుంది సార్. ప్రతాప్‌రెడ్డి అని మా ఫాదర్ పేరు మీరు వినే ఉంటారు" అన్నాడు దేవేందర్.

"ప్రతాప్‌రెడ్డి – యేది ఆ కంట్రాక్టర్ ప్రతాప్‌రెడ్డేనా?" ఆశ్చర్యంగా అడిగాడు భాస్కర్.

"ఎగ్జాట్లీ"

"మై గుడ్‌నెస్. ప్రతాప్‌రెడ్డి మీ ఫాదరా?"

"ఔనుసార్. అదేదో ప్రాజెక్టుకు సంబంధించిన బిల్స్ మీ దగ్గరే ఉన్నాయట"

"ఔను..."

"అవ్వి వెంటనే ప్యాసయ్యేట్టు చూసే భారం మీది సార్. అసలు అట్లాంటి విషయాలంటే నాకు పరమ చీకాకు. కాని మా ఫాదర్ నా ప్రాణాలు తీసేస్తున్నాడు. మీరు కొంచెం ఇంట్రెస్ట్ తీసుకొని అవి వెంటనే పాసయ్యేట్టు చూడాలి సార్. ప్లీజ్"

భాస్కర్ కాస్సేపు తటపటాయించాడు. అవ్వి యాభైవేల బిల్స్. దాంట్లో యేదో గూడుపుఠాణీ జరిగిందని తనకి తెలిసింది.

"ప్లీజ్ సర్. ఈమాత్రం చెయ్యలేరా?"

అతనితో, తన 'ఫ్యాన్'తో అంతగా బతిమాలించుకోవటం అసహ్యంగా తోచింది భాస్కర్‌కు. వెంటనే అన్నాడు:

"వోయస్. అదెంత పని. రేపే పుటప్ చేస్తాను. మీ బిల్స్ ప్యాసు చేయిస్తాను. డోంట్ వర్రీ"

"థాంక్యూ సర్ – థాంక్యూ వెరీమచ్. అయితే వస్తానిక. గుడ్‌నైట్"

అతడు స్టార్ట్ చేసిన కారు ఫ్లడ్‌లైట్స్ కంటే ప్రకాశవంతంగా వెలిగాయి దేవేందర్ కళ్ళు.

✧✧✧✧✧

– 'తరుణి' (మాసపత్రిక)